


బీసీ కమిషన్ గడువు పొడిగింపు

బెంగళూరు, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని బలహీనవర్గాల శాశ్వత కమిషన్ అధ్యక్షుడు, సభ్యుల గడువును వరుసగా రెండోసారి విస్తరిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. కులగణనపై రాష్ట్రంలో భారీగా చర్చ జరిగిన సంగతి విదితమే. బీసీ కమిషన్, ప్రభుత్వానికి మరో రెండు రోజుల్లో తన నివేదికను సమర్పించాల్సి ఉండగా తాజాగా కమీషన్ అవధిని ఫిబ్రవరి 15 వరకు పొడిగించారు. ఇందుకు సంబంధించి మంగళవారం ప్రభుత్వ ఆదేశాలు వెలువడ్డాయి.

చిచ్చు రేపుతున్న గాడ్సే అనుచరగణం


విధానసౌధ గాంధీ విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న సీఎం సిద్దరామయ్య తదితరులు

- శాంతి సామరస్యాలను దెబ్బతీయడమే వారి లక్ష్యం
- మండ్య ఘటన వెనుక రాజకీయ కుట్ర
- ముఖ్యమంత్రి సిద్దరామయ్య ఆగ్రహం
- మండ్యలో చిచ్చు పెట్టింది మీరే : జేడీఎస్
- మౌల్వి, ముల్లాల పాలన సాగుతోంది : బీజేపీ

బెంగళూరు, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): మండ్య జిల్లా కెరగూడు ఘటనపై అధికార, ప్రతిపక్షాల మధ్య వాక్ సమరం వరుసగా మూడో రోజు కూడా కొనసాగింది. మంగళవారం విధానసౌధ ప్రాంగణంలో గాంధీజీ చిత్రపటానికి ముఖ్యమంత్రి సిద్దరామయ్య పుష్పాంజలి ఘటించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ లోక్‌సభ ఎన్నికల వేళ గాడ్సే అనుచరగణం రెచ్చిపోతోందన్నారు. శాంతి సామరస్యాలను దెబ్బతీయడమే వీరి ఏకైక లక్ష్యంగా కనిపిస్తోందని పేర్కొన్నారు. జాతిపిత మహాత్మాగాంధీ శాంతిసందేశాలను ప్రతిపక్షాలైన బీజేపీ, జేడీఎస్ కాలరాస్తున్నాయని ఆక్రోశం వ్యక్తం చేశారు. మండ్య ఘటన వెనుక రాజకీయ దురుద్దేశ్యాలు స్పష్టంగా కనిపిస్తున్నాయని తెలిపారు. తాను హిందువునేనని, అన్ని మతాలను గౌరవిస్తానని, అందరికీ న్యాయం కల్పించేలా పాలన చేస్తున్నానని సీఎం ప్రకటించారు. ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ మాట్లాడుతూ స్వార్థ రాజకీయాల కోసం గాంధీజీ శాంతి మంత్రానికి విఘాతం కలిగిస్తున్నారంటూ ప్రతిపక్షాలపై విరుచుకుపడ్డారు. బీజేపీకి జాతీయ పతాకం కంటే మతజెండానే ప్రముఖంగా ఉందని, దీన్నిబట్టి వారి ఉద్దేశ్యం స్పష్టంగా తెలుస్తోందన్నారు. జాతిపితను బలిగొన్న గాడ్సే అనుచరగణం కూడా జాతీయపతాకాన్ని వ్యతిరేకించిన సంగతిని గుర్తు చేశారు. కాగా విధానపరిషత్‌లో బీజేపీ చీఫ్‌విప్ ఎన్. రవికుమార్ బెంగళూరులో మంగళవారం మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ మార్క్ లౌకికవాదాన్ని ఎద్దేవా చేశారు. సిద్దరామయ్య ప్రభుత్వానికి ఆయన 12 ప్రశ్నలు సంధించారు. అహింద మంత్రాన్ని సీఎం మరిచారని, ఇందులో బలహీనవర్గాలు, దళితుల ప్రయోజనాలను విస్మరించి కేవలం మైనారిటీలను అక్కున చేర్చుకుంటున్నారన్నారు. ఇది ముల్లా, మౌల్వీలపాలన అంటూ విరుచుకుపడ్డారు. రాజ్యాంగం గురించి, జాతీయ పతాకం గురించి కాంగ్రెస్ నేతలనుంచి నేర్చుకోవాల్సిన కర్మ తమకు పట్టలేదన్నారు.


కేపీసీసీ కార్యాలయంలో గాంధీజీ చిత్రపటానికి పుష్పాంజలి ఘటిస్తున్న సీఎం, డీసీఎం తదితరులు

మండ్యలో చిచ్చు పెట్టింది మీరే : కుమారస్వామి

మండ్య జిల్లా కెరగూడు ఘటనకు తనకు సంబంధం లేదని జేడీఎస్ నేత, మాజీ సీఎం హెచ్‌డీ కుమారస్వామి పేర్కొన్నారు. బెంగళూరులో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ బీజేపీ నేతల ఆహ్వానం మేరకే తాను నిరసన సభలో పాల్గొన్నానని, కాషాయ శాలువా ధరించడం భారతీయ సంస్కృతిలో భాగమేనని వివరణ ఇచ్చుకున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ తీరు కారణంగానే మండ్యలో ఉద్రిక్తత నెలకొందన్నారు. హనుమాన్ జెండాను తొలగించకుండా మరోచోట జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి ఉంటే సరిపోయేదన్నారు. పైపెచ్చు ప్రజలపై లాఠీచార్జ్ జరిపారని పేర్కొన్నారు. గతంలో రామనగర, చెన్నపట్టణలలో కూడా కాంగ్రెస్ హిందూ, ముస్లింల మధ్య గొడవలు సృష్టించిందని గుర్తు చేశారు. రాష్ట్రంలో శాంతి సామరస్యాలకు తమ పార్టీ మొదటి నుంచి పెద్దపీట వేస్తోందన్నారు. బీజేపీలో విలీనమైనట్టు కాంగ్రెస్ నేతల ప్రకటనలను తిప్పికొట్టారు. లోక్‌సభ ఎన్నికల ఫలితాల అనంతరం వీరందరికీ సరైన సమాధానం లభిస్తుందని వ్యాఖ్యానించారు.

చట్టాన్ని చేతుల్లోకి తీసుకుంటే సహించేది లేదు : హోంమంత్రి హెచ్చరిక

రాష్ట్రంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించేందుకు ప్రయత్నించినా, చట్టాన్ని చేతుల్లోకి తీసుకున్నా సహించే ప్రశ్నే లేదని హోంశాఖ మంత్రి డాక్టర్ జి. పరమేశ్వర్ హెచ్చరించారు. బీజేపీ, జేడీఎస్ నేతలు ఎక్కడైనా నిరసన ప్రదర్శనలు చేపట్టవచ్చునని అయితే ఇవి శాంతియుతంగా ఉండాలని సూచించారు. కెరగూడు ఘటనను కావాలనే ప్రతిపక్షాలు పెద్దవి చేస్తూ రాద్ధాంతం సృష్టిస్తున్నాయని అన్నారు. రాష్ట్రంలో మరే సమస్యలు లేనట్టు ప్రతిపక్షాలు వ్యవహరిస్తున్నాయని మండిపడ్డారు. జాతీయ పతాకాన్ని అవమానిస్తున్న బీజేపీ ఆత్మపరిశీలన చేసుకోవాలని తెలిపారు. మరో వైపు కేపీసీసీ ప్రధాన కార్యదర్శి ఎస్. మనోహర్ మంగళవారం బిజేపీ హితేంద్రకు జాతీయ పతాకానికి జరిగిన అవమానంపై ఫిర్యాదు చేశారు. కెరగూడు గ్రామంలో జరిగిన ఘటనకు కారకులైన బీజేపీ, జేడీఎస్ నేతలపై దేశద్రోహం కేసులు నమోదు చేయాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.

రూ. 3.80 లక్షల కోట్లతో రాష్ట్ర బడ్జెట్

- సూచన ప్రాయంగా వెల్లడించిన సీఎం

బెంగళూరు, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర బడ్జెట్ గాత్రం ఈసారి రూ.3.80 లక్షల కోట్లకు పెరగనుందని ముఖ్యమంత్రి సిద్దరామయ్య సూచనప్రాయంగా తెలిపారు. నగరంలో మంగళవారం ఆయన బడ్జెట్ సన్నాహక సమావేశం అనంతరం మీడియాతో మాట్లాడారు. ఇంత వరకు రాష్ట్ర బడ్జెట్ గాత్రం రూ.3.27 లక్షల కోట్లు దాటలేదు. తొలిసారి మరో 50వేల కోట్ల మేరకు బడ్జెట్ గాత్రం పెరగనుండటంతో సర్వత్రా ఆసక్తి నెలకొని ఉంది. రాష్ట్రంలో ఐదు గ్యారంటీ పథకాల కారణంగా ఖజానా ఖాళీ అయిందని, అభివృద్ధి కార్యక్రమాలకు నిధులు లేక ప్రభుత్వం దివాళా తీసిందని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్న నేపథ్యంలో రాష్ట్ర చరిత్రలోనే తొలిసారి భారీ గాత్రంతో బడ్జెట్‌ను సమర్పించేందుకు సీఎం సమాయత్తమవుతుండటం గమనార్హం. ప్రభుత్వం వద్ద ఆర్థిక వనరులు లేకుండానే ఇంత భారీగా బడ్జెట్‌ను రూపొందించడం సాధ్యమేనా అని సీఎం ప్రతిపక్షాలను సూటిగా నిలదీశారు. మతతత్వ అజెండాతో ముందుకు సాగుతున్న ప్రతిపక్షాలకు తన బడ్జెట్‌లో అభివృద్ధి అజెండాతో దీటైన సమాధానం ఇస్తానని సిద్దరామయ్య ప్రకటించారు.



కోవిడ్ మృతుల కుటుంబాల పరిహారానికి పైసల కొరత




- తక్షణం చెల్లించాలి : బీజేపీ

బెంగళూరు, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): కోవిడ్ కారణంగా మృతి చెందిన వారి కుటుంబాలకు తలా రూ.50వేల నష్టపరిహారం చెల్లించాలని కోర్టు ఆదేశాలు జారీ చేసినా ఇంకా అమలుకు నోచుకోలేదు. నిధుల కొరతే ఇందుకు కారణమని ప్రభుత్వ ఆరోగ్య శాఖ అధికారుల ద్వారా తెలుస్తోంది. జనవరి మొదటి వారంలోనే బాధిత కుటుంబాలకు పరిహారం అందజేయాలని హైకోర్టు డివిజన్ బెంచ్‌లు ఆదేశాలు జారీ చేసిన సంగతి తెలిసిందే. తొలి దశలో 850 కుటుంబాలకు తలా రూ.50వేల పరిహారం అందాల్సి ఉంది. గ్యారెంటీ పథకాలకు నిధుల సమీకరణ పెనుసవాల్‌గా మారిన తరుణంలో వీటిలోనే మునిగి తేలుతున్న ప్రభుత్వం కొవిడ్ పరిహారం చెల్లింపు విషయంలో శ్రద్ధచూపడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. కాంగ్రెస్ ప్రతిపక్షంలో ఉన్న సమయంలో కొవిడ్‌బారిన పడి మృతి చెందిన కుటుంబాలకు తలా రూ.5 లక్షల పరిహారం ఇవ్వాలని శాసనసభ లోపలా బయటా పోరాటాలు చేసింది. అదే కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 8 నెలలు దాటినా దీనిపై ఊసేలేకపోవడం విడ్డూరమని ప్రతిపక్షాలు అంటున్నాయి. కొవిడ్ బాధిత కుటుంబాలకు పరిహారం చెల్లించేందుకు గాను గ్రాంట్‌ను విడుదల చేయాల్సిందిగా సామాజిక భద్రత, పించన్ల మంత్రిత్వ శాఖ ప్రభుత్వానికి జనవరి 24న లేఖ రాసింది. తహసీల్దార్లు, జిల్లా అధికారులు దరఖాస్తుదారుల బ్యాంకుల ఖాతాలకు ఆధార్, ఎన్‌పీసీఐ మ్యాపింగ్ జాబితాను మంత్రిత్వ శాఖకు ఇప్పటికే పంపించినట్లు తెలిసింది. కేంద్ర ప్రభుత్వ మార్గసూచి ప్రకారం కొవిడ్‌బారిన పడి మృతి చెందిన నిరుపేద మధ్య తరగతి కుటుంబాలకు తలా రూ.50వేల పరిహారం చెల్లించేలా 2023-24 సంవత్సరానికి గాను రూ. 10 కోట్లను, ప్రకృతి వైపరీత్యాల సహాయ నిధికి అదనంగా మరో రూ. 10.61 కోట్లను కేటాయించారు. 850 బాధిత కుటుంబాలకు చెల్లించాల్సిన మొత్తం రూ. 15.50 కోట్లు కాగా పై రెండు మొత్తాలు ఇందుకు సరిపోతాయి. పరిహారం చెల్లింపు విషయంలో ఎందుకు జాప్యం జరుగుతున్నదో అర్థం కావడం లేదని ప్రతిపక్ష నేత ఆర్. అశోక్ పేర్కొన్నారు. తక్షణమే పరిహారం చెల్లించాలని ఆయన నగరంలో మంగళవారం డిమాండ్ చేశారు.

కొబ్బరికి మద్దతు ధర పెంపు

- రూ.1500 ప్రకటించిన రాష్ట్ర ప్రభుత్వం

బెంగళూరు, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): కొబ్బరి ధర పడిపోతుండడంతో రైతుల విజ్ఞప్తి మేరకు రాష్ట్ర ప్రభుత్వం క్వింటాలుకు రూ.1500 మద్దతు ధర ప్రకటించింది. 2024 సంవత్సరానికి సంబంధించి కనీస మద్దతు ధరలో భాగంగా నాణ్యమైన కొబ్బరి ఉండల (గిటక)కు ఈ మద్దతు వర్తిస్తుందని వ్యవసాయశాఖ నగరంలో మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపింది. ప్రభుత్వం ఈ మేరకు ఆదేశాలు జారీ చేసిందని, గత ఏడాది రూ.1250గా ఉన్న మద్దతు ధరను ప్రస్తుత ఏడాది రూ.1500కు పెంచామని పేర్కొంది. రాష్ట్రంలో గరిష్ఠంగా 62,500 మెట్రిక్ టన్నుల కొబ్బరిని మద్దతు ధరతో కొనుగోలు చేసేందుకు కేంద్రప్రభుత్వం అవకాశం కల్పించిందన్నారు. మద్దతు ధర మొత్తానికి రూ.93.75 కోట్లు ఖర్చు కాగలవని అంచనా వేస్తున్నట్టు పేర్కొంది. రాష్ట్రంలోని తుమకూరు, హాసన్, చిక్కమగళూరు, చిత్రదుర్గ, మండ్య, మైసూరు, దక్షిణకన్నడ, చామరాజనగర, రామనగర జిల్లాల్లో కొబ్బరి తోటలు ఎక్కువగా ఉన్నాయి.



రాజధానికి కొత్త రూపం

- ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్

బెంగళూరు, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ స్థాయిలో ఖ్యాతి గడించిన రాజధాని బెంగళూరు నగరానికి కొత్తరూపమిచ్చే దిశలో బీబీఎంపీ బడ్జెట్ ఉంటుందని బెంగళూరు నగర జిల్లా ఇన్‌చార్జ్‌గా ఉన్న ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ ప్రకటించారు. బెంగళూరు కేపీసీసీ కార్యాలయంలో మంగళవారం జాతిపిత మహాత్మాగాంధీకి నివాళులు అర్పించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. 2024-25 బీబీఎంపీ వార్షిక బడ్జెట్ కూర్పునకు సంబంధించి నగర ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలతో సోమవారం జరిపిన సమావేశంలో వ్యక్తమైన అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుంటామన్నారు. బ్రాండ్ బెంగళూరు పథకాన్ని పక్కాగా అమలు చేయాలని, ఫుట్‌పాత్ అక్రమణలు తొలగించాలని, అక్రమ-సక్రమ పథకానికి సంబంధించి కోర్టులో ఉన్న అడ్డంకులను పరిష్కరించాలని, నగరంలో నివసిస్తున్న నిరుపేదలకు సంక్షేమ కార్యక్రమాలను చేపట్టాలని జనాభాకు అనుగుణంగా నగర గ్రాంట్లు పెంచాలన్న అభిప్రాయాలు వ్యక్తమయ్యాయని తెలిపారు. మంగళవారం కూడా సచివాలయంలో ఆయన బీబీఎంపీ బడ్జెట్ కసరత్తు కొనసాగించారు. మంత్రులతోపాటు వివిధ శాఖల ఉన్నతాధికారులు హాజరయ్యారు.

రూ.8050 కోట్ల గ్రాంటు కేటాయించండి: బీబీఎంపీ

బెంగళూరు నగరంలో ట్రాఫిక్ నియంత్రణ, చెత్త నిర్వహణ, తాగునీరు తదితర మౌలిక సదుపాయాలు కల్పించేందుకు 2024-25 వార్షిక బడ్జెట్‌లో బీబీఎంపీకి కనీసం రూ.8050 కోట్ల గ్రాంటు కేటాయించాలని బృహత్ బెంగళూరు మహానగర పాలికె (బీబీఎంపీ), రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదన చేసినట్టు తెలుస్తోంది. ఫిబ్రవరి 16న ఆర్థికశాఖను నిర్వహిస్తున్న ముఖ్యమంత్రి సిద్దరామయ్య రాష్ట్ర బడ్జెట్‌ను సమర్పించనున్న సంగతి తెలిసిందే. ఇందిరాక్యాంటీన్లకు ఆహారాన్ని సమకూర్చే దిశలో రూ.60 కోట్లు, క్యాంటీన్ భవనాల నిర్మాణానికి రూ.30కోట్లు, బిల్లు బకాయిల చెల్లింపులకు రూ.110 కోట్లు కలిపి మొత్తం రూ.200 కోట్లను గ్రాంటుగా ఇవ్వాలని బీబీఎంపీ ప్రభుత్వానికి ప్రతిపాదించింది. చెత్త నిర్వహణకు రూ.600 కోట్లు కోరింది. ఆస్తి పన్నుల వసూళ్ల, ప్రకటనల ద్వారా రూ.5వేల కోట్లను సమకూర్చుకోవాలని భావిస్తోంది. బీబీఎంపీ పరిధిలో ఇప్పటికే అమలు చేస్తున్న పలు పథకాలకు సంబంధించి ఇంకా రూ.10,214 కోట్ల బకాయిని రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయాల్సి ఉందని బీబీఎంపీ అధికారి ఒకరు మంగళవారం మీడియాకు తెలిపారు. రాజధాని ప్రజల ఆకాంక్షలను నెరవేర్చేలా గ్రాంట్ల కేటాయింపు ఉంటుందన్న ఆశాభావాన్ని ఆయన వ్యక్తం చేశారు.


సచివాలయంలో వరుసగా రెండోరోజూ బీబీఎంపీ బడ్జెట్‌పై కసరత్తు చేస్తున్న ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్


నామినేషన్ సమర్పిస్తున్న అభ్యర్థి పుట్టణ్ణతో సీఎం, డీసీఎం, మంత్రులు

పుట్టణ్ణ విజయం తథ్యం : సీఎం

- మరోసెట్ నామినేషన్ దాఖలు

బెంగళూరు, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): బెంగళూరు ఉపాధ్యాయ నియోజకవర్గం కాంగ్రెస్ అభ్యర్థి పుట్టణ్ణ మంగళవారం మరోసెట్ నామినేషన్ దాఖలు చేశారు. ముఖ్యమంత్రి సిద్దరామయ్యతో పాటు ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్, మంత్రులు కేహెచ్ మునియప్ప, ఆర్. రామలింగారెడ్డి హాజరయ్యారు. అనంతరం సీఎం మీడియాతో మాట్లాడుతూ బీజేపీ-జేడీఎస్ చేతులు కలిపినా కాంగ్రెస్ అభ్యర్థి పుట్టణ్ణకు వందశాతం గెలుపు ఖాయమన్నారు. బెంగళూరు దక్షిణ ఉపాధ్యాయ నియోజకవర్గం నుంచి ఐదోసారి బరిలోకి దిగిన పుట్టణ్ణను సీఎం ప్రత్యేకంగా అభినందించారు.

వీసీ పోస్టులను భర్తీ చేయాలి

- బీజేపీ డిమాండ్

బెంగళూరు, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా పలు యూనివర్సిటీలలో ఖాళీగా ఉన్న వీసీ పోస్టులను తక్షణం భర్తీ చేయాలని బీజేపీ డిమాండ్ చేసింది. మాజీ ఉపముఖ్యమంత్రి డాక్టర్ సీఎన్ అశ్వత్థనారాయణ, మాజీ మంత్రి కె. గోపాలయ్య బెంగళూరులో మంగళవారం మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నత విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేస్తోందన్నారు. కొత్తగా ఏర్పాటైన ఏడు విశ్వవిద్యాలయాలకు ఇంతవరకు నిధులు విడుదల చేయకపోవడం దారుణమన్నారు. వీ టీలో కొన్ని విశ్వవిద్యాలయాలలో పది నెలలుగా ప్రొఫెసర్లకు జీతాలు ఇవ్వడం లేదన్నారు. హంపిలోని కన్నడ విశ్వవిద్యాలయం రూ.72తో కోట్ల ప్రతిపాదన పంపగా కేవలం రూ.1.20 కోట్లు విడుదల చేశారని పేర్కొన్నారు. నూతన యూనివర్సిటీలకు తక్షణం తలా రూ.2కోట్లు విడుదల చేయాలని డిమాం డ్ చేశారు. నెలలకొద్దీ వీసీ పదవులు ఖాళీగా ఉన్నా ఎందుకు భర్తీ చేయాలని ప్రశ్నించారు. ఉన్నత విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేస్తే సహించేది లేదని హెచ్చరించారు.




మీడియాతో మాట్లాడుతున్న బీజేపీ నేతలు

రంగశంకరలో కన్నడ నాటకోత్సవం ప్రారంభం

- ఫిబ్రవరి 4 వరకు నాటక ప్రదర్శనలు
- ప్రతి రోజూ రాత్రి 7.30 గంటలకు ప్రారంభం

బెంగళూరు, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): కన్నడ సాంస్కృతిక శాఖ సహకారంతో బెంగళూరు జేపీ నగర్‌లోని రంగశంకరలో నాటకోత్సవం మంగళవారం ప్రారంభమైంది. తొలిరోజు బెంగళూరు థియేటర్ అన్సాంబుల్ నిర్వహణలో 'నావు' నాటకాన్ని ప్రదర్శించారు. అభిమన్యు భూపతి ఈ నాటకానికి దర్శకత్వం వహించారు. బుధవారం కరియ దేవర హుడికి నాటకాన్ని ప్రదర్శించనున్నారు. సముదాయ సంస్థ ఆధ్వర్యంలో ఈ నాటకానికి నిరంజన ఖాలికూడ దర్శకత్వం వహించనున్నారు. ఫిబ్రవరి 1న ఆర్ధే అధూరే నాటకాన్ని మైసూరుకు చెందిన వర్ణ కలెక్టివ్ సంస్థ ప్రదర్శించనుంది. 2న దర్శకుడు నవీన్ సాణేహళ్లి సారథ్యంలో బెంగళూరు యాక్ట్ రియాక్ట్ సంస్థ అజ్ఞాతనొబ్బన ఆత్మచరిత్రె నాటక ప్రదర్శన ఏర్పాటవుతోంది. 3న పృథ్వి వేణుగోపాల్ దర్శకత్వంలో బెంగళూరు సంచయ నాటక బృందంచే నాట్యదేవర చరితె నాటక ప్రదర్శన జరగనుంది. చివరి రోజైన 4న సహనా పింజార్ దర్శకత్వంలో హొసపేట బహుత్వ ప్రతిష్ఠాన ఆధ్వర్యంలో శవద మనె నాటకాన్ని ప్రదర్శించనున్నారు. ఈ అన్ని నాటకాల ప్రదర్శన ప్రతిరోజూ సాయంత్రం 7.30కు ప్రారంభం కానుందని, ఈ అవకాశాన్ని నాటక ప్రియులు సద్వినియోగం చేసుకోవాలని నగరంలో మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో రంగశంకర విజ్ఞప్తి చేసింది.


కరియ దేవర హుడికి నాటకంలోని ఒక సన్నివేశం



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1588.55	1,617.33
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	000	000
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	354	8,422
సామర్థ్యం (టీఎంసీలు)	9.86	54.16

మూతబడిన ఇందిరా క్యాంటీన్లు

భోజనం లేక శాపనార్థాలు పెడుతున్న కూలీలు, పేద ప్రజలు

బళ్లారి గాంధీనగర్, జనవరి 30: బతుకుదెరువు కోసం నగరానికి వలస వచ్చే కూలీల ఆకలి బాధలు తీర్చేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన ఇందిరా క్యాంటీన్లు వారం రోజులుగా మూతబడ్డాయి. ఈ నెల 22వ తేదీ నుంచి నగరంలోని ఐదు ఇందిరా క్యాంటిన్లు మూతపడ్డాయి. నగరంలో మోతీ సర్కిల్, ఏపీఎంసి, విమ్స్ ఆసుపత్రి, బెళగల్లు క్రాస్, జిల్లా ఆసుపత్రిలో మొత్తం ఐదు క్యాంటీన్ల నిర్వహణ బాధ్యతలను సిటీ కార్పొరేషన్ చేపట్టింది. మూడేళ్ళుగా కార్పొరేషన్ అధికారులు ఇందిరా క్యాంటిన్ల నిర్వహణకు నిధులు విడుదల చేయకపోవడంతో ఏంచేయాలో తెలియక ఇక తన వల్ల కాదని కాంట్రాక్టరు చేతులెత్తేశాడు. ఫలితంగా కూలీలు, పేద ప్రజలు ఆకలి తీర్చుకోకుండానే వెనుదిరగాల్సిన పరిస్థితి నెలకొంది. ఇప్పటి వరకు సిటీ కార్పొరేషన్ సుమారు రూ 3.5 కోట్లకు పైగా బకాయిలు చెల్లించాల్సిఉందని క్యాంటీన్ల నిర్వహకులు తెలిపారు. కనీసం ఆరునెలల నిధులు విడుదల చేసినా క్యాంటీన్లను తిరిగి ప్రారంభిస్తామని చెప్పినా కార్పొరేషన్ కమీషనర్ పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. నగరంలో అధికార పార్టీకి చెందిన స్థానిక ఎమ్మెల్యే నారా భరత్ రెడ్డి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి బి.నాగేంద్ర దృష్టికి విషయాన్ని వెళ్ళినా సమస్య పరిష్కారం కాకపోవడం విడ్డూరంగా ఉంది. ఈ విషయాన్ని ఇందిరా క్యాంటిన్ల నిర్వహకులు జిల్లాధికారి దృష్టికి తీసుకెళ్ళడంతో ఆయన వెంటనే క్యాంటీన్లను తెరిపించాలని ఆదేశాలు జారీ చేశారు. అయినా కార్పొరేషన్ కమీషనర్ పట్టించుకోవడంలేదు. కొత్త టెండరు నెపంతో కమీషనర్ కాలాయాపన చేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రధానం గా నగరంలోని మోతీ సర్కిల్ వద్ద ఉన్న క్యాంటిన్‌కు నగరంలో పనుల నిమితం వచ్చే గ్రామీణ కూలీలతో పాటు సమీపంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, వార్తా కళాశాల, ఫ్యాషన్ డిజైన్ కళాశాల విద్యార్థులు వస్తారు. అదేవిధంగా జిల్లా ఆసుపత్రిలో ఉన్న ఇందిరా క్యాంటిన్ సమీపంలోని సరళాదేవి డిగ్రీ కళాశాల, పాత మున్సిపల్ హైస్కూలు విద్యార్థులకు అనుకూలంగా ఉండేది. ప్రస్తుతం వారం రోజులుగా పస్తులు ఉండాల్సిన పరిస్థితి నెలకొందని విద్యార్థులు వాపోతున్నారు. ఈ విషయంలో జిల్లా యంత్రాంగం కలుగజేసుకుని ఇందిరా క్యాంటీన్‌లను తెరిచే దిశగా చొరవ తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



మూతబడిన మోతి సర్కిల్ ఇందిరా క్యాంటీన్ ముందు సేదదీరుతున్న ప్రయాణికులు

ఎన్నాళ్లీ కష్టాలు?

వంతెన నిర్మించకపోవడంతో గ్రామస్థుల అగచాట్లు


మన్నూరుసూగూరు,ఉళయనూరు మధ్య నదిలో ద్విచక్రవాహనాల రాకపోకలు

కంప్లి, జనవరి 30 : శ్రీరామ్‌నగర్, కారటగి చుట్టుపక్కల గ్రామాలైన ఉళయనూరు, కుంటోజి, జమాపుర గ్రామాల ప్రజలు ప్రతినిత్యం కంప్లి వైపు వెళ్లాలంటే తుంగభద్ర నది దాటాల్సిందే. నది ఒడ్డున జీవనం సాగిస్తున్న వీరు ఏ పనికావాలన్నా అటునుంచి ఇటు పయనించాల్సిందే. ఈ సందర్భంగా సింగపూరు, సిద్దాపుర, జమాపుర, నంది హళ్లి, గ్రామాల ప్రజలు మాట్లాడుతూ మన్నూరు సూగూరు, ఉళయనూరు మధ్య నదిపై వంతెన ఏర్పాటు చేయాలని అనేకసార్లు అధికారులు, ప్రజాప్రతినిధులకు విన్నవించుకున్నామని అయినా పట్టించుకోలేదన్నారు. నది ఒడ్డున వుండే ఈ గ్రామాల ప్రజలు నదిలో నీరు వుండే సమయంలో బోట్ల ద్వారా ఉళయనూరు నుంచి మన్నూరు సూగూరుకు చేరుకుని కూలీ పనులకు వెళుతుంటారు. ప్రస్తుతం నీరు తగ్గిపోవడంతో తామే ద్విచక్రవాహనాలపై వెళ్లి పనులు ముగించుకుని వస్తున్నామని తెలిపారు. నదిలోని ఇసుకలో వాహనాల్లో పోలేకపోతున్నామని కనుక బ్రిడ్జి నిర్మించాలని కోరారు.

ఆధ్యాత్మికత బలోపేతం కావాలి

బళ్లారి, జనవరి 30: స్నేహపూర్వక వారసత్వ ప్రచార అభియాన్‌లో భాగంగా మానవసంబంధాలను బలోపేతం చేసేందుకు, ఆధ్యాత్మికతను చాటేందుకు నిరంతరం కృషి జరగాలన్నారు. బళ్లారి గాంధీభవన్ నుంచి మంగళవారం బయలు దేరిన సౌహార్దతాజాతా నగరంలోని ప్రధాన వీధుల గుండా వెళ్ళి రైల్వే స్టేషన్ పక్కనేఉన్న మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాలలు వేయడంతో ముగిసింది. ఈసందర్భంగా బళ్లారి జిల్లా కన్నడ సాహిత్య పరిషత్ అధ్యక్షుడు నిష్టిరుద్రప్ప మాట్లాడుతూ దేశంలో శాంతి నెలకొనాలంటే సామరస్యపూర్వకమైన సహజీవనం అవసరమన్నారు. ఈకార్యక్రమంలో సత్యబాబు మాటాడుతూ సామరస్యజీవనం దేశాన్ని ప్రగతిపథంలో నడిపిస్తుందన్నారు. ఈసందర్భంగా వెంకమ్మ, వెంకటేశ్, కాంగ్రెస్ నాయకులు వెంకటేశ్‌హెగ్డే, కోటేశ్వర్‌రావు, కన్నడ,కార్మిక సంఘాలు, వక్ఫ్‌బోర్డు అధ్యక్షుడు మహ్మద్ రఫీ, సదాఫ్ , హరిచమ్రన్ జైన్‌సంఘం, రైతు నాయకుడు కృష్ణ, శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఆసుపత్రి అదనపు భవనాల ప్రారంభం


ప్రభుత్వాస్పత్రి భవనాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నాగరాజు

సిరుగుప్ప, జనవరి 30 : రూ.కోటి వ్యయంతో నిర్మాణం చేపట్టిన అదనపు ప్రభుత్వాస్పత్రి భవనాలను ఎమ్మెల్యే బీఎం నాగరాజు మంగళవారం ప్రారంభించారు. సిరుగుప్ప పట్టణం ప్రభుత్వాస్పత్రిలో హెచ్‌కే ఆర్‌డీడీ రూ. కోటి నిధులతో ఈ పనులు పూర్తి అయిన నేపథ్యంలో ఎమ్మెల్యే ఈఎం నాగరాజు ఈ భవనాన్ని ప్రారంభించారు. రోగుల వ్యాధులను నయం చేసేందుకు వైద్యులు కృషి చేయాలని ఆయన సూచించారు. ఈ సందర్భంగా తాలుకా ప్రభుత్వాస్పత్రి వైద్యాధికారి డాక్టర్ ఈరణ్ణ, నగర వైద్యాధికారి డాక్టర్ గురునాథ్, కౌన్సిలర్ గణేష్, కాంగ్రెస్ నాయకులు పవన్‌కుమార్ దేశాయ్, నగర ప్రజలు పాల్గొన్నారు.

నగరసభ కమిషనర్‌గా గురుప్రసాద్

సిరుగుప్ప, జనవరి 30 : నగరసభ కమీషనర్‌గా హెచ్‌ఎన్ గురుప్రసాద్ అధికార బాధ్యతలు చేపట్టారు. ఇంతకు ముందున్న కమీషనర్ వేరే ప్రాంతానికి బదిలీ కావడంతో ఆ స్థానానికి గురుప్రసాద్ బాధ్యతలు స్వీకరించారు. ఆయనఇంతకుముందు హొస్పేట, ఇతర జిల్లాల్లో కమీషనర్‌గా సేవలందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, నగరసభ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. ఈ సందర్భంగా నగరసభ ఏఈఈ గంగాధరగౌడ, వక్ఫ్‌బోర్డు సభ్యులు అబ్దుల్ నబీ, సిబ్బంది పాల్గొన్నారు.

గాంధీ మార్గం అనుసరణీయం


సిరుగుప్పలో గాంధీ విగ్రహం వద్ద మౌనం పాటిస్తున్న తహసీల్దార్ విశ్వనాథ్

మహాత్మాగాంధీ అనుసరించిన సత్యం, అహింస భారత దేశానికే పరిమితం కాకుండా ప్రపంచదేశాలకు కూడా ఆదర్శంగా నిలిచాయని కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కాంతినోవ విల్సన్ పేర్కొన్నారు. బళ్లారి నగరంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం గాంధీవర్ధంతి సందర్భంగా ఆయన ఘనంగా నివాళులర్పించారు. గంగావతి బ్లాక్ కాంగ్రెస్ కార్యాలయంలో గంగావతి తాలూకా కాంగ్రెస్ అధ్యక్షులు షామీద్‌మనియార్ ఆధ్వర్యంలో గాంధీ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. అలాగే సిరుగుప్ప పట్టణంలో తహసీల్దార్ విశ్వనాథ్ గాంధీ సర్కిల్‌లో గాంధీజీ విగ్రహానికి పూలమాలలు వేశారు.
-న్యూస్ నెట్‌వర్క్, బళ్లారి సిటీ, సిరిగుప్ప, గంగావతి


గంగావతిలో గాంధీకి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నేతలు


బళ్లారి కాంగ్రెస్ కార్యాలయంలో.....

రైతులను మోసగిస్తున్న వడ్డీ వ్యాపారులపై చర్యలకు డిమాండ్

బళ్లారి గాంధీనగర్, జనవరి 30: రైతుల డబ్బుఅవసరాలను అవకాశంగా మార్చుకుని నగరానికి చెందిన పలువురు వడ్డీ వ్యాపారులు మోసాలకు పాల్పడుతున్నట్లు కన్నడ నాడు రైతు సంఘం ఆరోపించింది. రైతుల కష్టాలను వడ్డీ వ్యాపారులు అనుకూలంగా మార్చుకుని వారిని వీధిపాలు చేస్తున్నారని, అలాంటి వారిపై జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకుని రైతులకు అండగా నిలవాలని డిమాండ్ చేస్తూ శనివారం జిల్లాధికారి కార్యాలయం ముందు రైతు సంఘం సభ్యులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఈశ్వరప్ప మెణసిన మాట్లాడుతూ, బళ్లారి జిల్లాలో రైతులు వ్యవసాయ అవసరాల కోసం ఉన్న భూమిని వడ్డీవ్యాపారస్తుల వద్ద తాకట్టుపెట్టి డబ్బుతెచ్చుకోవడం సర్వసాధారణమని, అయితే రైతులు డబ్బులు తిరిగి చెల్లించిన తరువాత భూమి పత్రాలను తిరిగి ఇచ్చేయాల్సి ఉందని అన్నారు. అయితే ఎంతోమంది రైతులు వడ్డీ వ్యాపారుల చేతిలో మోసిపోయి భూములు కోల్పోవాల్సిన పరిస్థితి నేడు నెలకొందన్నారు. తాలూకా పరిధిలోని కొళగల్లు గ్రామానికి చెందిన కె.వీరన్నగౌడ అనే రైతు 2013 సంవత్సరంలో తనభూమిని తాకట్టుపెట్టి వడ్డీవ్యాపారస్తుల వద్దకొంతడబ్బు తీసుకున్నాడని, డబ్బు తిరిగి ఇచ్చిన వెంటనే భూమిని తిరిగి ఇచ్చేలా ఒప్పందం పత్రం రాయించుకున్నారన్నారు. కొన్నిరోజుల తరువాత కె.వీరన్న తీసుకున్న అప్పు వడ్డీతో తిరిగి చెల్లిస్తానని వెళ్లగా భూమిని ఇవ్వకుండా రుణదాతలు మొండికేస్తున్నట్లు, ఈ విషయంపై పోలీసుస్టేషన్‌కు వెళ్ళినా న్యాయం జరగలేదని కన్నడనాడు రైతు సంఘం అధ్యక్షులు ఈశ్వరప్ప మెణిసిన మీడియాకు తెలిపారు. భూమిని అడిగితే రైతు వీరన్నగౌడ కుటుంబాన్ని బెదిరిస్తున్నారని తెలిపారు. రైతు నుంచి అక్రమంగా భూమిని స్వాధీనం చేసుకున్న వారిపై చర్యలు చేపట్టి ఈరణ్ణగౌడ పోగొట్టుకున్న భూమిని తిరిగి దక్కేలా చేయాలని జిల్లాధికారిని కోరుతున్నట్లు తెలిపారు. వడ్డీ వ్యాపారుల చేతుల్లో ఒక్క వీరన్నగౌడ మాత్రమే కాదని, ఎంతో మంది రైతులు ఆస్తులు పోగొట్టుకుంటున్నారన్నారు. రైతులను మోసం చేసి ఆస్తులు పోగేసుకుంటున్న వడ్డీ వ్యాపారస్తులపై చర్యలు తీసుకోవాల్సినబాధ్యత అధికారులపై ఉందని ఆయన పేర్కొన్నారు. అనంతరం జిల్లాధికారికి, అసిస్టెంట్ కమీషనర్‌కు మనవి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షులతో పాటు ప్రధాన కార్యదర్శి ఆర్.ప్రహ్లాద్, గౌరవ అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి, ఉపాధ్యక్షులు మంజునాథ్‌లతో తదితరులు పాల్గొన్నారు.


జిల్లా అధికారి కార్యాలయం ముందు ఆందోళన చేస్తున్న రైతు సంఘం సభ్యులు

ప్రిన్స్ ప్రస్థానానికి 25 ఏళ్లు

సంబరాలు జరుపుకున్న మహేష్ బాబు అభిమానుల సంఘం


కేక్ కట్ చేస్తున్న రాధిక అనిల్, అభిమాన సంఘం అధ్యక్షుడు రాఘవరమేష్ తదితరులు

బళ్లారిరూరల్, జనవరి 30 : బళ్లారి నగరంలో సూపర్‌స్టార్ కృష్ణ, ప్రిన్స్ మహేష్ బాబు అభిమానుల సంఘం జిల్లా అధ్యక్షుడు రాఘవరమేష్ నేతృత్వంలో మంగళవారం రాధిక సినిమా థియేటర్‌లో సంబరాలు జరిగాయి. సూపర్‌స్టార్ మహేష్ బాబు చిత్రపరిశ్రమలో ప్రవేశించి 25 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా రాధిక థియేటర్ యజమాని సాయి అనిల్ సమక్షంలో కేక్ కట్ చేసి అభిమానుల మధ్య సంబరాలు జరుపుకున్నారు. అనంతరం పలువురికి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మహేష్ బాబు అభిమాన సంఘం అధ్యక్షులు రాఘవరమేష్ మాట్లాడుతూ సూపర్‌స్టార్ కృష్ణ, మహేష్‌బాబుల చిత్రాలు సమాజానికి స్ఫూర్తిగా నిలుస్తాయన్నారు. చిన్న వయసులోనే సినీ ప్రేక్షకులను మెప్పించి, ప్రేక్షకులకు గొప్ప స్ఫూరిని అందించే చిత్రాలను విజయవంతంగా నిర్మించారన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌స్టార్ కృష్ణ, మహేష్‌బాబు అభిమానుల సంఘం అధ్యక్షులు రాఘవరమేష్, సాయి క్యాటరింగ్ దేవకుమార్, రామాంజి, విశ్వ, గౌస్, సత్య, రవిశంకర్, సుబ్బారావు, ఖలందర్, సూరి, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

నాటక క్షేత్రంగా బళ్లారి

ధర్మవరం రామకృష్ణమాచార్యుల కృషి వల్లనే


డోలువాద్యంతో కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న నారాయణస్వామి, సురేంద్రబాబు తదితరులు

బళ్లారి సిటీ,జనవరి 30: బళ్లారిని నాటకక్షేత్రంగా తీర్చిదిద్దిన ఘనత డాక్టర్ ధర్మవరం రామకృష్ణమాచార్యులకు దక్కుతుందని నారాయణ స్వామి అభిప్రాయపడ్డారు. ధర్మవరం రామకృష్ణమాచార్యుల మెమోరియల్ ఎండోమెంట్ ట్రస్ట్, డిఆర్‌కే రంగసిరి ట్రస్ట్ సహకారంతో సోమవారం సాయంకాలం ఆంధ్రనాటక పితామహుడు ధర్మవరం రామకృష్ణమాచార్యులు రచించిన 137ఏళ్లనాటి చిత్రనళీయం నాటకాల ఔచిత్యంపై చర్చా కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో రిటైర్డ్ లెక్చరర్ సురేంద్రబాబు మాట్లాడుతూ ధర్మవరం రామకృష్ణమాచార్యులు నాటకాలు కళాకారులకు నీతి, వ్యక్తిత్వం ఎలాఉండాలో తెలియజేస్తాయన్నారు.

పరిశుభ్రత పాటించడం అందరి కర్తవ్యం: పుష్పాంజలి దేవి

బళ్లారి సిటీ, జనవరి 30: ప్రతి ఒక్కరూ పరిశుభ్రత పాటించాలని, ఇది ప్రతి ఒక్కరి కర్తవ్యమని జిల్లా న్యాయాధికారి పుష్పాంజలి దేవి అన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ జిల్లా బార్ ఆధ్వర్యంలో జాతీయ స్వచ్ఛతా దినోత్సవం సందర్భంగా కొత్త జిల్లా కోర్టు ఆవరణలో చెత్త రహిత భారత్ కార్యక్రమం వీడియో స్క్రీనింగ్‌ను ఆమె ప్రారంభించి మాట్లాడారు. ప్రతి ఒక్కరూ మనచుట్టూ ఉన్న పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. జాతీయ పరిశుభ్రత దినోత్సవం సందర్భంగా ప్రముఖులు, పౌరుల పరిశుభ్రత కర్తవ్యం పై గోడపత్రికలను విడుదల చేశారు. కార్యక్రమంలో స్వీప్ ఇండియా స్వచ్ఛంద సంస్థ శశిధర్ కల్మట్ అవగాహన కల్పించారు. అనంతరం జాతీయ స్వచ్ఛతా దినోత్సవంలో భాగంగా జిల్లా జడ్జీ కోర్టు ఆవరణలో పరిశుభ్రత పనులు నిర్వహించారు. ఫ్యామిలీ జడ్జీ సిద్దలింగ, నందగావ్, న్యాయమూర్తి సతీశ్ , సివిల్ జడ్జీ అపర్ణ, సివిల్ జడ్జీ నస్రత్ ముఖ్తార్ అహ్మద్ ఖాన్ , రాజేశ్ హొసమనె, అమీత్ ఘట్టి, ఈరప్ప దవళేశ్వర్, రూప, ముదుకప్ప ఇతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



పరిశుభ్రతపై గోడపత్రికలను విడుదల చేస్తున్న న్యాయాధికారులు

హోసూరు జోన్

కరుణానిధి శత జయంతి సందర్భంగా పట్టాల పంపిణీ


పట్టాల పంపిణీ చేస్తున్న ఆహార సరఫరా మంత్రి చక్రపాణి

హోసూరు(కృష్ణగిరి) జనవరి 30 : డాక్టర్ కరుణానిధి శత జయంతి సందర్భంగా 2098 మంది లబ్దిదారులకు ఉచిత ఇంటి పట్టాల పంపిణీని ప్రారంభించారు. లబ్దిదారులకు రూ.4 కోట్ల సబ్ డివిజన్ ప్లాట్లను ఆహార సరఫరా శాఖ మంత్రి ఆర్.చక్రపాణి, జిల్లా కలెక్టర్ కె.ఎం.సరయు, అసెంబ్లీ సభ్యులు వై.ప్రకాశ్, అందజేశారు. అలాగే రెవిన్యూ శాఖ తరపున డెంకణీకోట, బర్గూరులో ప్రత్యేక శిబిరాలు నిర్వహించి ప్రజల నుంచి వినతి పత్రాలు స్వీకరించారు. తదనంతరం ఆహార పోషకాహార శాఖ మంత్రి కృష్ణగిరి సర్కిల్‌లో 407 మందికి, బర్గూరు సర్కిల్లో 209 మందికి, పోచ్చంపల్లి సర్కిల్లో 300 మందికి ఇంటి స్థలం, పట్టా మార్పు, సబ్ డివిజన్ ప్లాట్‌లు ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా పంచాయతీ కమిటీ అధ్యక్షుడు మణిమేఘలై నాగరాజ్, కృష్ణగిరి దేవాదయ శాఖ కమీషనర్ సి.బాబు, కృష్ణగిరి నగర కౌన్సిల్ ఉపాధ్యక్షురాలు సావిత్రి కడలరసుమూర్తి, మాజీ పార్లమెంట్ సభ్యుడు వెట్రిసెల్వన్, అసెంబ్లీ సభ్యుడు మురుగన్, హాజరయ్యారు.

తళి అడవికి ఏనుగుల తరలింపు

హోసూరు(మత్తిగిరి) జనవరి 30 : మత్తిగిరి ప్రభుత్వ క్యాటల్‌ఫాంలో రెండు ఏనుగులు విడిది చేయడంతో అటవీశాఖ అధికారులు వాటిని తళి అడవులకు పంపారు. గత నెలలో కర్ణాటక రాష్ట్ర అటవీప్రాంతం నుంచి తప్పించుకున్న రెండు మగ ఏనుగులు హోసూరు సమీపంలోని మత్తిగిరి ప్రభుత్వ పశువుల ఫారంలోకి ప్రవేశించాయి, వాటి గురించి డ్రోన్ కెమెరాలతో పర్యవేక్షించి తెలుసుకున్న అధికారులు ఆ ఏనుగులు పశువుల ఫాంల్లో ఉన్న యడేనల్లూరు రైతు పొలాల్లోని పనస మానులు కొమ్మలను చిదరగొట్టి పండ్లను తిని , పంట పొలాలను ధ్వంసం చేస్తున్నాయని కనిపెట్టారు. దీనిపై ఆ ప్రాంత ప్రజలు అటవి రేంజర్ దశరథకు సమచారం అందించారు. కాంపౌండ్ గోడలను బద్దలు కొట్టి, పంట పొలాలపై దాడి చేస్తున్నాయని, తెలియజేసి ఎలాగైన వాటిని తరిమి కొట్టాలని కోరారు. తమ పంట పొలాలను రక్షించాలని వేడుకున్నారు. ఈ మేరకు అటవీ రేంజర్ దశరథ వాటిని తళి అటవీ ప్రాంతాలకు తరిమి కొట్టారు,

కుక్కల దెబ్బకు గ్రామంలోకి వచ్చిన జింక

హోసూరు జనవరి 30 : హోసూరు సమీపంల్లోని భైరసంద్రంకు చేరుకున్న జింక కుక్కల బెడదకు భయపడి అర్ధరాత్రి వేళ ఓ కొట్టాంకు చేరుకుంది. కుక్కల నుంచి దానిని రక్షించిన భైరసంద్రం గ్రామానికి చెందిన ఉపశంకర్, రాత్రంతా తన ఇంటిలోనే ఉంచి ఉదయం గ్రామస్తులకు సమాచారం అందించాడు, అటవీశాఖాధికారులకు సమాచారం అందించాడు. హోసూరు అటవీశాఖాధికారులు అక్కడికి వెళ్లి దానికి చికిత్సఅందించి, అడవిలో వదలి పెడతామని తీసుకెళ్లారు.



కుష్ఠు వ్యాధిపై ప్రజల్లో అవగాహన కల్పించాలి

● జడ్పీ సీఈఓ రాహుల్ తుకారాం పాండ్యే


ప్రతిజ్ఞ చేయిస్తున్న జడ్పీ సీఈఓ రాహుల్ తుకారాం పాండ్యే

రాయచూరు జనవరి 30 : స్పర్శ ఉండే కుష్ఠువ్యాధిపట్ల ప్రజలకు స్పష్టమైన అవగాహన కల్పించే విధంగా అధికారులు కృషి చేయాలని జడ్పీ సీఈఓ రాహుల్ తుకారాం పాండ్యే అన్నారు. వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో మంగళవారం నుంచి ఫిబ్రవరి 13వ తేదీ వరకు నిర్వహించే కుష్ఠు వ్యాధి అవగాహన కార్యక్రమానికి సంబంధించి మంగళవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. సమావేశంలో మాట్లాడిన జడ్పీ సీఈఓ, వ్యాధి లక్షణాలు తీసుకోవలసిన జాగ్రత్తలపై ప్రజలకు మరింత అవగాహన కల్పించాలన్నారు. వ్యాధి లక్షణాలు కనిపించిన వెంటనే సమీపంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స పొందే ఏర్పాటు చేయాలన్నారు. ఈ విషయంలో వివిధ ప్రజా సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు ఇతరత్ర సామాజిక సేవా సంస్థల నుంచి తగిన సహకారం తీసుకోవాలన్నారు.

గ్యారెంటీల పై విజయేంద్ర విమర్శలు మతిలేని వ్యాఖ్యలే!

రాయచూరు జనవరి 30 : రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సంక్షేమం కోసం అమలు చేస్తున్న గ్యారెంటీ పథకాలు ప్రజలకు చేరడం లేదంటూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బీవై విజయేంద్ర చేసిన ఆరోపణలు ఆయన మతిలేనితనాన్ని తెలుపుతున్నాయని కేపీసీసీ కార్యదర్శి ఎ.వసంత్ కుమార్ అన్నారు. మంగళవారం నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో విలేఖరుల సమావేశం ఏర్పాటు చేసి ఆయన మాట్లాడారు. ఇటీవల జిల్లా పర్యటనకు వచ్చిన విజయేంద్ర, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా విశ్వాసం కోల్పోయిందని గ్యారంటీల అమలులో విఫలమైందని ఆరోపించడం హాస్యస్పదమన్నారు. నిజంగా గ్యారెంటీ పథకాల గురించి ఆయన మాట్లాడాలనుకుంటే సమగ్ర సమాచారాన్ని తెలుసుకుని మాట్లాడాలన్నారు. ఆయన ఇంట్లో పని చేసే పనివాళ్లను అడిగినా గ్యారెంటీ పథకాల అమలు గురించి వివరిస్తారని ఎద్దేవా చేశారు.

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాలమ్...

డాక్టర్ ద రా బేంద్రె (జయంతి)



ప్రముఖ కన్నడ కవి, 'పద్మశ్రీ' గ్రహీత దత్తాత్రేయ రామచంద్ర బేంద్రె (ద రా బేంద్రె) 1896 జనవరి 31న ధార్వాడలో జన్మించారు. కవిగా 'అంబికా తనయ దత్త' కలం పేరిట రచనలు చేశారు. వృత్తి రీత్యా ఉపాధ్యాయుడైనా సాహిత్యంపై మక్కువతో ఎన్నో రచనలు చేసి 'వరకవి'గా పేరొందారు. నాటకాలు, పరిశోధనాత్మక రచనలు, కావ్య విమర్శలు రచించారు. శివమొగ్గలో కన్నడ సాహిత్య సమ్మేళనానికి అధ్యక్షత వహించారు. 'నాకు తంతి' పుస్తకానికి 'జ్ఞానపీఠ' పురస్కారం దక్కింది. ఉడుపి అదమారుమఠం నుంచి 'కర్ణాటక కవి తిలక' బిరుదు పొందారు. కేంద్ర సాహిత్య అకాడమీ తదితర పురస్కారాలు పొందారు. ఆయన జీవితంపై ప్రముఖ దర్శకుడు గిరీశ్ కర్నాడ్ ఒక డాక్యుమెంటరీ సినిమా తీశారు. బేంద్రె 1981 అక్టోబరు 26న కన్నుమూశారు.

కందుకూరి రామభద్రరావు (జయంతి)



జాతీయవాదిగా పేరొందిన కందుకూరి రామభద్రరావు 1905 జనవరి 31 తూర్పు గోదావరి జిల్లా ఆత్రేయపురం మండలం రాజవరం గ్రామంలో జన్మించారు. తెలుగు, సంస్కృత, ఆంగ్ల భాషలలో నిష్ణాతులు. మహాత్మా గాంధీ అనుయాయి. ఉత్తమ ఉపాధ్యాయుడిగా, విద్యావేత్తగా, ఉపన్యాస చతురుడిగా మన్ననలు అందుకున్నారు. ఆకాశవాణి విజయవాడ కేంద్రంలో విద్యాకార్యక్రమాల ప్రయోక్తగా, లలిత గీతాలు, దేశభక్తి గీతాలు, సంగీత రూపకాలను రచించి, ప్రసారమై జనరంజకం కావడంలో కీలకంగా వ్యవహరించారు. పద్య, గేయరచనా పద్ధతుల్లో వీరు సవ్యసాచి. 1976 అక్టోబరు 8న అస్తమయం చెందారు.

దయా మాత (జయంతి)



దయా మాత 1914 జనవరి 31న అమెరికాలో జన్మించారు. ఆమె అసలుపేరు రాచెల్ ఫయె రైట్. పరమహంస యోగానంద శిష్యురాలు. యోగోద సత్సంగ సొసైటీ ఆఫ్ ఇండియా (వైఎస్ఎస్)కి ఐదు దశాబ్దాలకుపైగా అధ్యక్షురాలిగా వ్యవహరించారు. ఆధ్యాత్మిక సంస్థ సెల్ఫ్ రియలైజేషన్ ఫెలోషిప్ (ఎస్ఆర్ఎఫ్) ద్వారా బోధనలు విస్తృతం చేశారు. ఆధ్యాత్మిక వేత్త, మానవతావాదిగా పేరొందారు. గురు బోధనలు ప్రచారం చేయడమే లక్ష్యంగా సాగారు. 2010 నవంబరు 30న పరమపదించారు.

ఎంఆర్ అప్పారావు (వర్ధంతి)



మేకా రంగయ్య అప్పారావు 1915 మార్చి 21న కృష్ణా జిల్లా నూజివీడులో జన్మించారు. జమీందారు కుటుంబానికి చెందిన ఆయన విద్యావేత్త, మాజీ మంత్రి కూడా. కాంగ్రెస్‌లో క్రియాశీలకంగా ఉంటూ మద్రాస్ అసెంబ్లీకి, ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీకి నూజివీడు నుంచి పలుమార్లు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 1974-80ల మధ్య సాంస్కృతిక మంత్రిగా వ్యవహరించారు. ఆంధ్రా యూనివర్సిటీకి ఉప కులపతిగా పని చేశారు. 1981-82లమధ్య రాజ్యసభ సభ్యుడిగా వ్యవహరించారు. పలు రచనలు చేయడమే కాక సాహిత్య, సాంస్కృతిక సంస్థలకు సాయం అందించారు. 2003 జనవరి 31న కన్నుమూశారు.

శాంతి, సామరస్యం వెల్లివిరియాలి

ప్రజాసంఘాల నాయకుడు ఏజీ సుధాకర్.. గాంధీ వర్ధంతి సందర్భంగా పలుచోట్ల మానవహారాలు



బంగారపేట పట్టణంలో మానవహారం

బాగేపల్లి, జనవరి 30: సమాజంలో శాంతి, సామరస్యం వెల్లివిరియాలని పలువురు ప్రజాసంఘాల కన్వీనర్ ఏజీ సుధాకర్ ఆకాంక్షించారు. సౌహార్ద రాష్ట్ర కోసం ప్రగతిపర విమర్శకులు, రచయితలు, పోరాటనేతలు, విద్యార్థులు మంగళవారం భారీ మానవహారంగా ఏర్పడ్డారు. ఈ సందర్భంగా సుధాకర్ మాట్లాడుతూ భిన్నత్వంలో ఏకత్వంగా ఉన్న మనదేశం 'సర్వజనాంగద శాంతియ తోట' అన్నారు. విభిన్న వర్గాలు, మతాలవారు ఉన్నా వారి భావాలకు భంగం కలగకుండా శాంతియుతంగా జీవనం సాగిస్తున్నారన్నారు. అయితే రాజ్యాంగబద్ధమైన హక్కులు, ప్రయోజనాలు అందరికీ దక్కాలని ఆకాంక్షించారు. రాజ్యాంగ పీఠికను సీపీఎం తాలూకా కార్యదర్శి రఘురామరెడ్డి నేతృత్వంలో ప్రతిజ్ఞ చేయించారు. ముస్లిం సమాఖ్య, దళిత సంఘర్ష సమితి, క్యాథలిక్ సభ, సీఐటీయూ, జనవాది మహిళా సంఘం, డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ, కర్ణాటక ముస్లిం జమాతె, ఆదివాసీ హక్కుల సమితి తదితర సంఘాల సభ్యులు పాల్గొని మానవహారంగా ఏర్పడ్డారు.

బంగారపేటలో...

బంగారపేట : సమాజంలో సౌహార్ద్రత, మను ష్యుల మధ్య సత్సంబంధాలు నెలకొనాలని కోరుతూ మహా త్మాగాంధీ వర్ధంతిని పురస్కరించుకుని పట్టణంలో మంగళ వారం ప్రత్యేకంగా మానవహారం ఏర్పాటు చేశారు. తొలుత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి, మహాత్మాగాంధీ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి రెండు నిమిషాలు మౌనం పాటించారు. క్యాథలిక సామాజిక వర్గ ప్రముఖులు స్వాండ్లి మాట్లాడుతూ వివేకంతో కూడిన మార్గం, శాంతి, సంతృప్తికరత మనస్థితి వల్ల సమాజంలో వైషమ్యాలు ఉండవని ఇదే సౌహార్ద్రత అని అభిప్రాయ పడ్డారు. కేపీఆర్ఎస్ ప్రముఖుడు పీ శ్రీనివాస్ మాట్లాడుతూ భిన్నత్వంలో ఏకత్వమైన భారతదేశంలో అన్ని మతాలు, కులాల వారు ఆరోగ్య కరమైన సమాజంలో కొనసాగాలని ఆకాం క్షించారు. జమాత్-ఎ-ఇస్లామి హింద్ తాలూకా ప్రము ఖుడు ముబారక్ భాగ్‌బన్ మాట్లాడుతూ ప్రపంచానికి మాదిరిగా భారతదేశం ఉందని అభిప్రాయ పడ్డారు. ఇంతటి దేశంలో కర్ణాటక తనదైన గుర్తింపు కలిగి ఉందన్నారు. ఎంతోమంది వచనకారులు, దాసలు, సూఫీలు, తత్వపదకారులు, కవులు, వివిధ ధార్మిక గురువులు, చింతకులు ఆదర్శ సమాజంకోసం కృషి చేశారన్నారు. బెమెల్ కార్మిక సంఘం మాజీ ఉపాధ్యక్షుడు అర్జునన్, సముదాయ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు అచ్యుత్ తదితరులు ప్రసంగించారు. సముదాయ కళాకారుల బృందాల నాడగీత, జానపదాలు ఆలపించారు. కార్యక్రమంలో డీహెచ్ఎస్ ప్రముఖుడు ఏ పిచ్చకణ్ణ, గ్రామపంచాయతీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బీఎల్ కేశవరావ్, టీ అప్పయ్యణ్ణ, జీ గణేశన్, సోమశేఖర్, ఇంతియాజ్ ఉద్దీన్ తదితరులు పాల్గొన్నారు.



బాగేపల్లిలో మానవహారంలో వివిధ సంఘాల నాయకులు



బొమ్మనహళ్లిలో బ్లాక్ కాంగ్రెస్ నాయకులు తదితరులు

బొమ్మనహళ్లిలో...

బొమ్మనహళ్లి : మహాత్మాగాంధీ వర్ధంతిని పుర స్కరించుకుని ప్రధాన కూడళ్లలో మంగళవారం మాన వహారం ఏర్పాటు చేశారు. హెచ్ఎస్ఆర్ బ్లాక్ కాంగ్రెస్ అధ్య క్షుడు వాసుదేవరెడ్డి ఆధ్వర్యంలో తొలుత గాంధీకి నివాళులర్పించారు. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, మాజీ ఎంపీ ఉగ్రప్ప కూడా పాల్గొన్నారు. హెచ్ఎస్ఆర్‌లోని స్వాభిమాన పార్క్‌లో ఆయన ప్రసంగిస్తూ స్వాతంత్ర్యం కోసం ఎనలేని పోరాటం చేసిన గాంధీజీ చివరకు నాథూరాం గాడ్సే చేతిలో హతమయ్యారని విచారం వ్యక్తం చేశారు. స్వాతంత్ర్యం కోసం కులమతాలకు అతీతంగా స్త్రీ పురుషులు చిన్నా పెద్దా తేడా లేకుండా ఎంతోమంది ప్రాణత్యాగం చేశారన్నారు. కొన్ని పార్టీలు కులం, మతాల పేరిట రెచ్చ గొడుతూ అశాంతికి కారణమవుతున్నాయన్నారు. బొమ్మనహళ్లి నుంచి కూడ్లు గేట్ వరకు మానవహారంగా ప్రజలు నిలబడ్డారు. పలు చోట్ల సౌహార్ద కర్ణాటక పేరిట మానవహారం ర్యాలీ నిర్వహించారు. ప్రకాశ్, అనిల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రేపటి కేంద్ర బడ్జెట్‌పై వేతనజీవుల ఆశలు

బెంగళూరు, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల వేళ కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ 2024-25 వార్షిక బడ్జెట్‌ను ఫిబ్రవరి 1న పార్లమెంటులో సమర్పించనుండడంతో అందరి దృష్టి అటే నిమగ్నమై ఉంది. ప్రత్యేకించి పన్ను రాయితీలకోసం వేతనజీవులు ఆశగా ఎదురు చూస్తున్నారు. మౌలిక సదుపాయాల రంగానికి బడ్జెట్‌లో పెద్దపీట వేయవచ్చునని అంచనా వేస్తున్నట్టు కర్ణాటక వాణిజ్య పరిశ్రమల సమాఖ్య అభిప్రాయపడింది. సమాఖ్య అధ్యక్షుడు రమేశ్‌చంద్ర లహోటి బెంగళూరులో మంగళవారం మీడియాతో మాట్లాడుతూ బడ్జెట్ రోజు ఉదయం 11 గంటలకు సమాఖ్య ప్రాంగణంలో ప్రత్యక్ష ప్రసారం వీక్షించే అవకాశం కల్పిస్తున్నామన్నారు. రాష్ట్రం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న నిర్మలా సీతారామన్ ఈసారి కర్ణాటకకు వరాలు ప్రకటిస్తారని ఆశాభావంతో ఉన్నామన్నారు. మరోవైపు ముఖ్యమంత్రి సిద్దరామయ్య సోమవారం కేంద్ర మంత్రి నిర్మలాసీతారామన్‌కు ఒక లేఖ రాశారు. రాష్ట్రంలోని వెనుక బడిన ప్రాంతమైన రాయచూరులో ఆలిండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఎయిమ్స్)ను ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. కల్యాణ కర్ణాటక ప్రాంతంలోని రాయచూరుకు అత్యున్నత నాణ్యతా ప్రమాణాల వైద్యసేవలు అవసరమని లేఖలో పేర్కొన్నారు.

గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు అంతరిక్ష జ్ఞానం

» ప్రభుత్వానికి తారె జమీన్‌పర్ బృందం వినతి

బెంగళూరు, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): చంద్రయాన్ విజయవంతం కావడంతో అంతరిక్ష విశేషాలు తెలుసుకోవాలన్న కుతూహలం విద్యార్థులలో అధికంగా ఉందని ఇందుకు తగిన అవకాశం కల్పించాలని ప్రభుత్వానికి వర్నాజ్ టెక్నాలజీస్ సంస్థ నిర్వహణలోని తారె జమీన్‌పర్ బృందం మంగళవారం విజ్ఞప్తి చేసింది. బెంగళూరులో శాస్త్ర సాంకేతిక శాఖల మంత్రి బోసరాజును బృందం భేటీ అయి తమ సంస్థ చేపడుతున్న కార్యకలాపాలను వివరించింది. ఇంతవరకు 8వేల పాఠశాలలకు వెళ్లి 17లక్షలమంది విద్యార్థులకు ఖగోళ శాస్త్రంపై అవగాహన కల్పించే ప్రయత్నాలు చేశామని తెలిపింది. గ్రామీణ ప్రాంతాలలోని పాఠశాల ప్రాంగణాలలో మొబైల్ ప్లానెటోరియంల ద్వారా ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యంతో విద్యార్థులకు అంతరిక్ష జ్ఞానాన్ని బోధించేందుకు సిద్ధంగా ఉన్నట్టు తెలిపారు. కేవలం 11 జిల్లాల్లో మాత్రమే ప్లానెటోరియంలు ఉన్నాయని, మిగిలిన 20 జిల్లాల్లో మొబైల్ ప్లానెటోరియం వల్ల విద్యార్థులకు ఎంతో ప్రయోజనం లభిస్తుందని సంస్థ సీఈఓ దినేశ్ బడగండి మంత్రికి విజ్ఞప్తి చేశారు.



మంత్రి బోసరాజుతో చర్చిస్తున్న సంస్థ ప్రతినిధులు

కుష్ఠువ్యాధి నియంత్రణపై జాగృతి



కార్యక్రమంలో పాల్గొన్న వైద్యులు, ఉపాధ్యాయులు తదితరులు

చింతామణి, జనవరి 30: కుష్ఠురోగం శాపం కాదని అది ఒకరకమైన బ్యాక్టీరియా వల్ల సోకే రోగమని ప్రారంభంలోనే గుర్తించి తగిన చికిత్స పొందితే వంద శాతం గుణం అవుతుందని పట్టణ ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి డాక్టర్ బసవ మంజేశ్ అభిప్రాయపడ్డారు. పట్టణంలోని మహాత్మాగాంధీ ప్రభుత్వ హైస్కూల్ లో మంగళవారం కుష్ఠురోగంపై అవగాహన ర్యాలీలో పాల్గొని ఆయన మాట్లాడుతూ చిక్కబళ్లాపుర జిల్లాను కుష్ఠురోగ రహితగా మార్చేందుకు అందరూ సహకరించాలన్నారు. శరీరంపై తెల్లటి, తామ్రవర్ణంలో మచ్చలు, కాలు, చేతులలో స్పర్శ జ్ఞానం లేకపోవడం వంటివి ప్రధాన లక్షణాలన్నారు. ఇటువంటి లక్షణాలను గుర్తిస్తే వెంటనే నిర్లక్ష్యం చేయకుండా వెంటనే సమీపంలోని ప్రభుత్వ ఆసుపత్రులలో తగిన పరీక్షలు చేయించుకుని చికిత్స పొందాలన్నారు. తాలూకా సీనియర్ ఆరోగ్య అధికారి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ తాలూకాలో మొత్తం 14మందికి కుష్ఠురోగంతో బాధపడుతున్నారని, వీరిలో నలుగురు కోలుకున్నారని వారిని ఆత్మీయంగా సత్కరించారు. మహాత్మా గాంధీ అప్పట్లో కుష్ఠురోగులలో ఎంతో ధైర్యం నింపేవారన్నారు. ఈ నేపథ్యంలో మహాత్మాగాంధీ వర్ధంతిని పురస్కరించుకుని ఇలాంటి చైతన్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు రమేశ్, సీనియర్ ఆరోగ్య అధికారులు లక్ష్మణరెడ్డి, వైవీ సరస్వతమ్మ, నగర ఆరోగ్యకేంద్రం ప్రాథమిక సురక్షతా అధికారులు, తాలూకా ఆశా అధికారి త్రివేణి, ఆశా కార్యకర్తలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రధానోపాధ్యాయురాలి సస్పెన్షన్‌కు సిఫారసు

» విద్యార్థులచే మరుగుదొడ్ల శుభ్రతే కారణం

శిడ్లఘట్ట, జనవరి 30: పాఠశాల ప్రాంగణంలోని మరుగుదొడ్ల స్వచ్ఛతకు విద్యార్థులను వినియోగించరాదనే ఆదేశాలు ఉన్నా పట్టించుకోకపోవడంతో ప్రధానోపాధ్యాయురాలు ఒకరు సస్పెండ్‌కు గురయ్యారు. వివరాలిలా ఉన్నాయి. తాలూకాలోని కుద్దప్పకుంటె నమ్మూర ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులచే మరుగుదొడ్లను స్వచ్ఛపరిచారనే అంశంపై స్థానిక అధికారులు ఆరా తీశారు. ఈ మేరకు ప్రధానోపాధ్యాయుడిపై క్రమశిక్షణా చర్యలకు మంగళవారం సిఫారసు చేశారు. ప్రధానోపాధ్యాయురాలు బీ రేణుకా తీరుపై స్థానికులనుంచి ఆక్రోశం వ్యక్తమైంది. కాగా మరుగుదొడ్లను విద్యార్థులు శుభ్రం చేస్తున్న ఫోటోలు, వీడియోలు వైరల్ అయ్యాయి. తాలూకా పంచాయతీ కార్యనిర్వహణాధికారి జీ మునిరాజు, బీఈఓ నరేంద్రకుమార్, సాంఘిక సంక్షేమశాఖ అధికారి జగదీశ్ తదితరుల బృందం మంగళవారం స్థానికుల నుంచి సమాచారం సేకరించింది. అనంతరం బీఈఓ నరేంద్రకుమార్ మాట్లాడుతూ ఘటనకు సంబంధించి ఎమ్మెల్యే కూడా ఆరా తీశారని, ప్రధానోపాధ్యాయురాలిపై సస్పెన్షన్‌కు సిఫారసు చేస్తూ విద్యాశాఖ డిప్యూటీ డైరెక్టర్‌కు నివేదిక పంపామన్నారు.



ఘటనపై ఆరా తీస్తున్న అధికారులు

రాజ్యాంగ జాగృతి రథానికి స్వాగతం

దొమ్మసంద్ర, జనవరి 30: రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రజలకు తెలియచెప్పేలా సాంఘిక సంక్షేమశాఖ ఆధ్వర్యంలో జాగృతి రథం రాష్ట్రవ్యాప్తంగా పర్యటిస్తోంది. అత్తిబెలె పురసభ ఆధ్వర్యంలో రథానికి మంగళవారం ఘన స్వాగతం పలికారు. తొలుత అంబేడ్కర్ విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. మహిళలు పూర్ణకుంభాలతో స్వాగతం పలికారు. అత్తిబెలె పురసభ పరిధిలోని పురవీధులలో రథం ఊరేగింది. సాంఘిక సంక్షేమ శాఖ సహాయక డైరెక్టర్‌లు మంజునాథ్, అత్తిబెలె పురసభ అధ్యక్షురాలు మాలా రమేశ్, ఉపాధ్యక్షురాలు జయలక్ష్మమ్మ, వెంకటేశ్, స్థాయి సమితి అధ్యక్షుడు కెచ్చు గణేశ్, ముఖ్య అధికారి మంజునాథ్, పురసభ సభ్యులు, ప్రముఖులు పాల్గొన్నారు. గణేశ్, నాగరాజ్ సోని, ఎస్ఎల్‌వీ మురళి, బిదర గుప్పె రాజేశ్, వేణు, తిమ్మారెడ్డి, అధికారులు, పౌర కార్మికులు తదితరులు పాల్గొన్నారు. స్థానికులు ఉత్సాహంగా భాగ స్వామ్యులయ్యారు.



రాజ్యాంగరథం వద్ద స్థానిక ప్రముఖులు

హృద్రోగ చికిత్స ఖర్చును తగ్గిద్దాం

బెంగళూరు, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): అందుబాటులో ఉన్న ఆధునిక సాంకేతికతను గరిష్ఠంగా వినియోగించుకుంటూ హృద్రోగ చికిత్సకు అయ్యే ఖర్చును తగ్గించడం ద్వారా నిరుపేదలకు బాసటగా నిలబడాలని నగరంలో జరుగుతున్న హృద్రోగ సదస్సు పిలుపునిచ్చింది. కావేరి ఆసుపత్రి గ్రూప్ నిర్వహణలో రెండు రోజులపాటు జరిగిన సదస్సులో తీసుకున్న నిర్ణయాలను ఆసుపత్రి మేనేజింగ్ డైరెక్టర్ ఎస్ చంద్రకుమార్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ విజయ్ భాస్కరన్ మంగళవారం మీడియాకు తెలిపారు. 25వ వార్షిక సదస్సులో దేశ విదేశాలనుంచి పలువురు నిపుణులు హాజరయ్యారని, హృద్రోగ చికిత్సలో చోటు చేసుకుంటున్న ఆధునిక పద్ధతులపై ప్రత్యేక ప్రసంగాలు చేశారన్నారు. వీటన్నింటిని క్రోడీకరించి రానున్న రోజుల్లో సామాన్యులు, మధ్య తరగతి ప్రజలకు చేకూరేలా కార్యక్రమాలు రూపొందించాలని భావిస్తున్నామన్నారు.



జ్యోతి ప్రజ్వలనలో ప్రముఖులు

విద్యార్థుల కోసం సరికొత్త యాప్

బెంగళూరు, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): పరీక్షలకు సన్నాహాలు చేసుకుంటున్న విద్యార్థులు, ఉపాధ్యాయులతో అనుసంధానమై పాఠ్యాంశాలకు సంబంధించి తమ సందేహాలను నివృత్తి చేసుకునేందుకు జీనియస్ యాప్‌ను ఈడెన్ ఎడ్జ్ సంస్థ విడుదల చేసింది. సంస్థ ప్రతినిధి విజయకుమార్ ఈ మేరకు నగరంలో మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రతి విద్యార్థి నేరుగా ఉపాధ్యాయుడిని ప్రశ్నలు అడిగి వాటిని పరిష్కరించుకుంటూ పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించేందుకు అవసరమైన కిటుకులను తెలుసుకునేందుకు అనువుగా ఈ యాప్‌ను రూపొందించామని ఆయన తెలిపారు. ఆ యా రాష్ట్రాల్లోని ఉపాధ్యాయుల సహకారంతో నిర్వహిస్తున్న యాప్‌ను ఈ పరీక్షల సమయంలో ఎక్కువ మంది విద్యార్థులు ఉపయోగించుకుంటారని ఆయన తెలిపారు. తాజా అప్‌డేట్స్‌లో విద్యార్థులు పరీక్షలను సులభతరంగా ఎదుర్కొనేందుకు ఈ యాప్ చక్కటి మార్గదర్శి కానుందని ఆయన ప్రకటనలో తెలిపారు.

జాతీయ రాజకీయాలపై మాజీమంత్రి బీసీ పాటిల్ దృష్టి

» బీజేపీ టికెట్ కోసం తీవ్ర యత్నం

బెంగళూరు, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): జాతీయ రాజకీయాలపై సినీనటుడు, మాజీ మంత్రి బీసీ పాటిల్ దృష్టి సారించారు. ఒకవేళ పార్టీ అధిష్ఠానం టికెట్ ఇస్తే లోక్‌సభ ఎన్నికల బరిలోకి ఉరికేందుకు సన్నద్ధంగా ఉన్నట్లు ఆయన ప్రకటించారు. హావేరిలో మంగళవారం మీడియాతో మాట్లాడారు. తాను రాజకీయ సన్యాసిని గానని ఆయన స్పష్టం చేశారు. హావేరిలో కొత్తనేతకు ఈ సారి బీజేపీ టికెట్ దక్కే అవకాశం ఉందని గట్టిగా వినిపిస్తోన్న నేపథ్యంలో బీసీ పాటిల్ వ్యాఖ్యలు రాజకీయ ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. బీజేపీ ఇప్పటికే నియోజకవర్గంలో గెలుపు గుర్రం వేటలో ఉంది. ఇందుకు సంఘ్‌పరివార్ సారథ్యంలో రహస్య సమీక్ష జరిపిస్తున్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బీవై విజయేంద్ర కూడా హావేరి నియోజకవర్గం ప్రజల ఆకాంక్ష మేరకే అభ్యర్థి ఉంటాడని సూత్రప్రాయంగా చెప్పడం ఈ సందర్భంగా గమనార్హం. కాగా ఒక వేళ తనకు టికెట్ రాకపోయినా బాధపడబోనని అధిష్ఠానం నిర్ణయించే అభ్యర్థి విజయం కోసం కృషి చేస్తానని బీసీ పాటిల్ వెల్లడించారు. వ్యవసాయ శాఖా మంత్రిగా చక్కటి పనితీరును ప్రదర్శించి అధిష్ఠానం వద్ద బాగా మార్కులు కొట్టేసిన బిసి.పాటిల్ లోక్‌సభకు పోటీచేయాలని ఆయనకు కేంద్ర మంత్రి అయ్యే అన్ని అర్హతలు ఉన్నాయని పార్టీలోని ఒక వర్గం గట్టిగా అభిప్రాయపడుతున్నట్లు సమాచారం.

బంగారుపేటలో ఎమ్మెల్యే అభిమానుల సందడి



రోడ్ షోలో ఎమ్మెల్యే నారాయణస్వామి తదితరులు

బంగారపేట, జనవరి 30: బంగారపేట నియోజకవర్గ ఎమ్మెల్యే ఎస్ఎన్ నారాయణస్వామి కర్ణాటక నగర మౌలిక సదుపాయల అభివృద్ధి మండలి అధ్య క్షుడిగా బాధ్యతలు స్వీకరిం చిన నేపథ్యంలో పట్టణంలో సోమవారంరాత్రి రోడ్ షో నిర్వహించారు. నంది మెడికల్ సర్కిల్ నుంచి కువెంపు సర్కిల్ వరకు ఎమ్మెల్యే అభిమానులు బాణాసంచా కాలుస్తూ మిఠాయిలు పంచి పెడుతూ సందడి చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలోని పట్టణాల అభివృద్ధి చేసేందుకు మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం ఉత్తమ అవకాశాన్ని కల్పించిందన్నారు. కాంగ్రెస్ జాతీయ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే, రాష్ట్ర ముఖ్యమంత్రి సిద్దరామయ్య, ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి సురేశ్‌ల సహకారంతో ఉన్నతస్థాయి హోదా దక్కిందని వారికి తన ధన్యవాదాలు తెలిపారు. బంగారపేట, జిల్లా కేంద్రమైన కోలారు, ముళబాగిలు, మాలూరు, కేజీఎఫ్ తదితర పట్టణాలలో మౌలిక సదుపాయాల మెరుగుకు తొలి ప్రాధాన్యత ఇవ్వనున్నట్టు తెలిపారు. అలాగే కేంద్రప్రభుత్వ పథకాలైన అమృత్‌సిటీ, టౌన్‌షిప్ ఇతర పథకాలు, రాష్ట్ర పథకాలతో అన్ని ప్రధాన పట్టణాలను అభివృద్ధి చేయనున్నట్టు తెలిపారు. మునిసిపాలిటీలను, పట్టణాలను అభివృద్ధి చేసి ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడంలో ప్రామాణికంగా ప్రయత్నం చేస్తానన్నారు. కాగా ఈసారి లోక్‌సభ ఎన్నికల్లో అభ్యర్థిని హైకమాండ్ తీర్మాని స్తుందని, అభ్యర్థి ఎవరైనా వారి విజయానికి అందరూ కలసికట్టుగా శ్రమించాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు పార్థసారథి, పిచ్చహళ్ళి గోవిందరాజు, గోపాలరెడ్డి, చందు సుహేల్, రఘునాథ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రైతుల రుణాలు మాఫీ చేయాలి



బ్యాంకు ఉద్యోగికి వినతిపత్రం అందజేస్తున్న రైతు సంఘం నాయకులు

బాగేపల్లి, జనవరి 30: రైతుల రుణమాఫీకి డిమాండ్ చేస్తూ రాష్ట్రవ్యాప్తంగా సంకల్పయాత్ర చేపట్టదలిచామని రాష్ట్ర రైతుసంఘం, హసిరుసేన అధ్యక్షుడు ఆర్ మాధవరెడ్డి తెలిపారు. పట్టణంలోని కర్ణాటక గ్రామీణ బ్యాంకు వద్ద మంగళవారం ధర్నా చేపట్టి మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా 22 జిల్లాల్లో 54లక్షలమంది రైతులు సుమారు 26వేల కోట్ల రూపాయల పంటల రుణాలను కర్ణాటక గ్రామీణ బ్యాంకు ద్వారా పొందారన్నారు. అతివృష్టి, అనావృష్టి కారణంగా నష్టపోయిన రైతులను ఆదుకునేలా పంటలరుణాన్ని మాఫీ చేసి, కొత్త రుణాలను ఇవ్వాలని డిమాండ్ చేశారు. రుణాల చెల్లింపులకు సంబంధించి బ్యాంకులనుంచి నోటీసులు వస్తున్నాయని ఇది రైతుల ఆత్మహత్యకు కారణమవుతోందన్నారు. వెంటనే కేంద్ర ప్రభుత్వం రుణ వసూళ్లను ఆపాలన్నారు. కాగా రుణం మొత్తం కంటే నాలుగురెట్లు అధికంగా చెల్లించాలని నోటీసు వచ్చిందని, కర్ణాటక గ్రామీణ బ్యాంకునుంచి అవుతున్న అన్యాయాన్ని ఖండిస్తూ రైతులు ఆక్రోశం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా స్థానిక కర్ణాటక గ్రామీణ బ్యాంకు మేనేజర్ తరపున బ్యాంకు ఉద్యోగి తేజస్వినికి వినతిపత్రం అందజేశారు. నిరసనలో రైతు ప్రముఖులు శ్రీనివాస్, రఘునాథ్‌రెడ్డి, వెంకటరెడ్డి, గోవిందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక భద్రతను కల్పిస్తున్న గ్రాట్యుటీ పథకాలు

బెంగళూరు, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): తప్పనిసరి గ్రాట్యుటీ, బీమా నియమాలు రాష్ట్రంలో ఉద్యోగులకు ఆర్థిక భద్రతను కల్పిస్తున్నట్టు పాలసీబజార్ ముఖ్యులు సర్జా ప్రవీణ్ చౌదరి పేర్కొన్నారు. నగరంలో మంగళవారం ఆయన ఈమేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. పలు కంపెనీలు ఆర్థిక సవాళ్ల నేపథ్యంలో ఉద్యోగులకు గ్రాట్యుటీ కల్పించడం లేదని ఇలాంటి చోట గ్రాట్యుటీ బీమా పథకం నిర్ణయాత్మకపాత్రను పోషిస్తుందన్నారు. ఇది తప్పనిసరి కావడంతో ఉద్యోగులకు తమ భవిష్యత్తు ఆర్థిక అవసరాలపై భరోసా కలుగుతుందన్నారు. వీటిపై సర్వత్రా అవగాహన కల్పించేందుకు జరుగుతున్న ప్రయత్నాలపై ఆయన హర్షం వ్యక్తం చేశారు.


ద్విముఖ గణపతి ఆలయంలో సంకష్ట పూజలు



విశేష అలంకరణలో ద్విముఖ గణపతి

శిడ్లఘట్ట, జనవరి 30: పట్టణంలోని అశోక రోడ్డులోని ద్విముఖ గణపతి ఆలయంలో సంకష్టహర చతుర్థి పూజలు భక్తిశ్రద్ధలతో జరిగాయి. సోమవారం సాయంత్రం నుంచి రాత్రి వరకు స్వామి వారికి విశేషపూజలు నిర్వహిం చారు. సాలగ్రామ పూజలు, కుంకుమార్చన అనంతరం పుష్పాలంకరణ, నైవేద్యం సమర్పించారు. పెద్దసంఖ్యలో మహిళలు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు. మహిళలు చక్కటి భక్తి పాటలు ఆలపించారు. అర్చకులు పండిత్ కృష్ణమూర్తి, ఆయన సోదరులు కార్యక్రమాలను నిర్వహించారు. పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొని స్వామికృపకు పాత్రులయ్యారు.

4న హన్సికా నృత్య రూపకం ప్రదర్శన



నృత్యరూపకం (ఫైల్)

బెంగళూరు, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): ప్రఖ్యాత నృత్య కళాకారిణి శర్మిళా ముఖర్జీ నృత్య సంస్థ సంజలి సెంటర్ ఫర్ ఒడిస్సీ డ్యాన్స్ సమర్పణలో ఫిబ్రవరి 4న హన్సికా ఒడిస్సీ నృత్య ప్రదర్శన ఏర్పాటవుతోంది. ఈ మేరకు సంస్థ నగరంలో మంగళవారం ఒక ప్రకటన విడుదల చేసింది. బెంగళూరు జేసీ రోడ్డులోని ఏడీఏ రంగమందిరంలో సాయంత్రం 6.30కు ఈ ప్రదర్శన ప్రారంభం కానుంది. రష్యా బ్యాలె స్వాన్ లేక్ ఆధారంగా ఈ నాటక రూపాన్ని హన్సికా పేరుతో ఒడిస్సీలోకి రూపాంతరం చేసిన సంగతి విదితమే. 25 మంది నృత్య కళాకారుల బృందం హన్సికాలో భారతీయ శాస్త్రీయ నృత్యంతో పాటు ఒడిస్సీని మేళవించి పాశ్చాత్య శాస్త్రీయ సంగీతాన్ని ప్రదర్శించనున్నట్లు ప్రకటనలో తెలిపారు. హన్సికా నృత్యరూపకంలో ప్రణయం, మోసం కలబోసి ఉంటాయని ప్రేక్షకుల్ని అలరిస్తాయని పేర్కొన్నారు. రష్యా బ్యాలెలో రాజకుమారుడు సీగ్‌ఫ్రైడ్ రాజకుమారి ఒడెట్ ల మధ్య గాఢమైన ప్రేమ ఉంటుంది. అయితే ఒక దుష్టమాంత్రికుడి కారణంగా హంసగా మారిపోతారు. కొద్దిపాటి మార్పులు చేర్పులతో భారతీయ నృత్య ప్రియులను ఆకట్టుకునేలా హన్సికాను తీర్చిదిద్దామని నిర్వాహకులు ప్రకటనలో వెల్లడించారు.